

జైలు కైనా వెళతాం.. ఇంటి పట్టాలు వదలం

జైలుకైనా వెళతాం.. ఇంటి పట్టాల వ్యవహారాన్ని వదిలేది లేదని బాధితులు రెవెన్యూ కార్యాలయం ముందు బైఠాయించారు. -8లో..



పాల ట్యాంకర్ పేలి ఒకరు మృతి

రాయచోటిలో పాలట్యాంకర్ పేలి టెక్నిషియన్ జోగేంద్ర సింగ్ (32) అక్కడిక్కడే మృతి చెందాడు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1033 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	300
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 46.88 కిలోలు

న్యూస్‌రీల్

28న హజ్ యాత్రికులకు టీకాలు

రాయచోటి అర్బన్: జిల్లా నుంచి హజ్‌యాత్రకు వెళ్లేవారికి ఈనెల 28న టీకాలు వేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రాయచోటిలోని థాణా సమీపంలో ఉన్న జామియా మసీదు కార్యాలయంలో పరీక్షలు నిర్వహించి టీకా వేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు చెందిన హాజ్‌యాత్రికులు తప్పక టీకా వేయించుకోవాలన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ ద్వారా హజ్‌కు వెళ్లే యాత్రికులు కూడా పరీక్షలు, టీకా వేయించుకునేందుకు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

29న శ్రీహరికోటకు బస్సులు

పీలేరురూరల్: శ్రీహరికోటలో ఈ నెల 29న జీఎస్‌ఎల్‌వీ ఎఫ్ 12 రాకెట్ లాంచింగ్ వీక్షణకు పీలేరు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ తోపాటు సుళ్లూరుపేటలోని శ్రీ చెంగాలమ్మ అమ్మవారి దర్శనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పీలేరు నుంచి సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు.రానుపోను రూ.520 చార్జిగా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 9959225679, 7382878751, 7893152748 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా గురువారం 62 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. పరీక్షలకు 10658 మంది విద్యార్థులకుగాను 10048 మంది హాజరయ్యారు. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 9045 మందికిగాను 8573 మంది, ద్వితీయ సంవత్సరానికి 1613 మందికిగాను 1475 మంది హాజరయ్యారు. ఆర్ఐవో రమణరాజు రాయచోటి ప్రాంతంలో పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

నేటి నుంచి సాఫ్ట్‌బాల్ పోటీలు

సుండుపల్లె (రాయచోటిటౌన్): రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఈనెల 26వ తేదీ నుంచి జరగనున్నాయి. ఇందుకోం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండూరు రవీంద్ర రాజు, మండల విద్యాశాఖాధికారి వెంకటేష్ నాయక్ తెలిపారు. సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 28వ తేదీ వరకు పోటీలు జరగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.పోటీలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు.

'ఉపాధిలో ఉద్యానానికి ప్రాధాన్యత'

బి.కొత్తకోట: ఉపాధి హామీ పథకం పనుల్లో ఉద్యానవనాల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. గురువారం బి.కొత్తకోటలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సభకు హజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఈఏడాది ఐదువేల ఎకరాల్లో ఉద్యానవన పంటలకు ఉపాధి ద్వారా ఆర్థిక సహకారం అందించేందుకు నిర్ణయించగా ఇప్పటి వరకు 365 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 83 లక్షల పనిదినాలు కల్పించాలన్న లక్ష్యంకాగా ఇప్పటివరకు 29,47,746 పనిదినాలు కల్పించామని చెప్పారు. ఉపాధి పనుల కోసం రూ.92.98 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రతికూలీకి రోజుకు రూ.272 వేతనం చెల్లిస్తున్నామని చెప్పారు. 91 చెరువుల్లో పూడికతీత పనులు సాగుతున్నట్టు చెప్పారు.

అంతర్ పంటల సాగు మేలు



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న రాజస్థాన్ మహిళలు

వాల్మీకిపురం: ప్రధాన పంటల సాగుతో పాటు అంతర్ పంటల సాగు రైతులకు ఎంతో మేలని, తద్వారా రైతులు అధిక ఆదాయం పొందొచ్చని రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రాజేష్ అన్నారు. మండలంలోని చింతపర్తిలో రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగును గురువారం పది మంది రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మహిళలు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రకృతి సాగును చేపట్టిన రైతులు మాట్లాడుతూ 360 రోజుల పాటు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు సాగు చేయడంతో పాటు నిత్యం వచ్చిన దిగుబడులను మార్కెట్‌కు తరలించి ఆదాయం పొందుతున్నామని రాజస్థాన్ మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రెడ్డి బాషా, మునిరా, పెద్ద రెడ్డెయ్య, హేమలత, హరినాథ రెడ్డి, శ్రీనాథ రెడ్డి, రాజస్థాన్ రాష్ట్ర మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతిబాట..లాభాల పంట

- అరెకరం పొలంలో 30 రకాల పంటలు
- మహిళారైతు సాగు
- 3 నెలల వ్యవధిలోరూ.20 వేల ఆదాయం



పీఎండీఎస్ విధానంలో సాగైన రాగి పంట (ఇన్‌సెట్) రైతు రాధిక

రాయచోటి: పంటల్లో క్రిమి సంహారక మందుల ప్రభావం రోజురోజుకీ అధికమవుతోంది. దీంతో ఆధునిక రైతులు..రసాయన సేద్యానికి స్వస్తి పలికి.. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు.ఆశావహమైన, ఆరోగ్యదాయకమైన దిగుబడులు సాధిస్తూ లాభాల బాట పడుతున్నారు. అందుకు సాక్ష్యమే అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం తెట్టు గ్రామానికి చెందిన తలారి రాధిక. రెండేళ్ల అనుభవంతోనే ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్(ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) విధానాన్ని అంటే తొలకరి చినుకులకు ముందే విత్తనం వేసే విధానం అవలంబిస్తూ అధిక దిగుబడులతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

ఉన్నంతలో ఆదాయం..

చందమామ స్వయం సహాయక సంఘం సభ్యురాలైన రాధిక ఒకవైపు సంఘమిత్రగా పనిచేస్తూనే తనకున్న 50 సెంట్ల పొలంలో 30 రకాల పంటలు వేసి 3 నెలల వ్యవధిలో రూ.20 వేల నికర ఆదాయాన్ని పొందుతూ మరెందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఇంటర్మీడియట్ చదువుకున్న రాధిక మూడు పదుల వయస్సులో రెండు సంవత్సరాలుగా తనకున్న అవగాహనతో ప్రకతి వ్యవసాయంతో పంటలు సాగు చేస్తూ, పాడితో ఆర్థికంగా ముందుకు సాగుతోంది. తనకున్న కొద్ది పాటి ఎర్ర ఇసుక నేలలో ఈ ఏడు మార్చి 24వ తేదీన 13 కిలోల విత్తనాలతో 30 రకాల పంటలు వేశారు. నవ ధాన్యాలతో పాటు దుంపజాతి, తీగజాతి, కాయగూరలు, ఆకుకూరలు పండిస్తున్నారు. మొక్కజొన్న, రాగులు, సజ్జలు, అలసంద, కొర్ర, అండు కొర్ర, అనుములు, పెసలు, ఉలవలు, శెనగలు, మినుములు, నువ్వులు ఆముదం, ఆవాలు, జొన్నలు, దనియాలు, మెంతులు, వంగ, టొమాటో, 3 రకాల ఆకుకూరలు, ముల్లంగి, క్యారెట్, మిరప, బీన్స్, బీర, కాకర, సొర, దోస విత్తనాలతో సాగు చేశారు.

అన్నింటా ఆదాయం..

పొలంలో 6 కాలువగా చేసిన విధానంలో ఒక్కో కాలువకు మూడు వేల చొప్పున రూ.18 వేల విలువ చేసే పశుగ్రాసం రావడం సంతోషాన్ని ఇచ్చిందని రాధిక చెబుతోంది. పశుగ్రాసంతో పాటు కాయగూరలు, ఆకుకూరలు విక్రయించగా నికర ఆదాయం రూ.16550 వచ్చింది. విత్తన దశ నుంచి పంట కోత వరకు ఎలాంటి రసాయనాలు వాడకుండా పూర్తిగా ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించడం వల్ల సాగుకైన ఖర్చు కేవలం రూ.2600 మాత్రమే, ప్రకతి వ్యవసాయం, పీఎండీఎస్ విధానాల వల్ల ఆర్థిక లాభం చేకూరడంతో పాటు జీవవైవిధ్యం పెరిగి నేలలో సేంద్రీయ కర్బన శాతం అధికమై నేల సారవంతమైందని రాధిక అంటున్నారు.

పంటలతోనే సూక్ష్మ పోషకాలు..

వివిధ రకాల పంటలు వేయడం వల్ల భూమిలో సూక్ష్మజీవులు ఉత్పన్నమై మొక్కలకు కావాల్సిన పోషకాలు అందినట్లు చెప్పారు. ఈ పద్ధతిలో చీడపీడలు, తెగుళ్ల బాధ కూడా లేకుండా పోయిందని అన్నారు. అంతేకాక నేలగుల్ల బారి వానపాముల సంఖ్య బాగా వద్ధి చెందినదని, నేలలో నీటి నిలువ సామర్థ్యం కూడా పెరిగింది. పశుగ్రాసం కొనుగోలు చేసిన తోటి రైతులు కూడా నవధాన్యాల పంటల వల్ల పశువులకు మంచి పోషకాలు అందుతాయని సంతోషం వ్యక్తం చేశారు. పంట ఏపుగా పెరగడం వల్ల చుట్టుపక్కల రైతులు మా పొలం దగ్గరికి వచ్చి పశుగ్రాసం కొనుగోలుకు రిజర్వ్ చేసుకుంటున్నట్లు తెలిపారు...

మరో 25 సెంట్లలో సాగు..

ప్రకతి వ్యవసాయంలో సత్ఫలితాలు వసుతడటం వల్ల పీఎండీఎస్‌తో పాటు మరో 25 సెంట్ల విస్తీర్ణంలో 365 రోజుల ఏ గ్రేడ్ మోడల్ వేయుటకు సిద్ధంగా ఉన్నానని రాధిక అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది. ప్రకతి వ్యవసాయంలో అనుభవం గడించి మంచి ఆదాయం ఆర్జిస్తున్న రాధిక ఇతర రైతులను కూడా ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తున్నారు.

తయారు చేసిన ఎరువులతో..

ముందుగా ఇంటి వద్దనే తయారు చేసుకున్న ఘన జీవామృతాన్ని దుక్కిలో 200 కిలోలు వేశారు. అంతకు ముందు జీవామృతంతో నారు, విత్తనాలను శుద్ధి చేశారు. 200 లీటర్ల ద్రవ జీవామృతంతో పిచికారీ చేశారు. మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగు నివారణకు 100 లీటర్ల నీటిలో 50 గ్రాములు కారం పొడి వేసి ఆ ద్రావణం పిచికారీ చేయడంతో ఫలితం కనిపించింది...



ఘనజీవామృతం తయారుచేస్తున్న దృశ్యం

రైతులను మార్చేందుకు యత్నం

ప్రతి రైతు తప్పక పీఎండీఎస్ చేయాలి.ప్రధాన పంటతో పాటు అంతర పంటలు కూడా వేయాలి. తొలుత తన పొలం చుట్టూ ఉన్న ఆయిదుగురు రైతులను మార్చే ప్రయత్నంలో ఉన్నాం. రసాయన రహిత పదార్థాలను తీసుకోవడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు.

–రాధిక, మహిళా రైతు, కురబలకోట, అన్నమయ్య జిల్లా

నేడు గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లోని గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌లలో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతుల కౌన్సెలింగ్ జరుగుతుందని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైనల్ సీనియారిటి జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. సీనియారిటి జాబితాలో ఉన్న వారంతా కడప కోటిరెడ్డిసర్కిల్ సమీపంలోని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల(ఆర్‌జేడీ ఆఫీసు) కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సర్వీసు రిజిస్టర్‌తో హాజరుకావాలని ఆర్‌జేడీ సూచించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



రాజంపేటలో సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ

రాజంపేట: నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామని వైఎస్సార్ ఉమ్మడి జిల్లాల ఎపీఎస్పీడీసీఎల్ సూపరిండెంట్ ఇంజినీరు రమణ అన్నారు. శుక్రవారం రాజంపేట డివిజన్ కార్యాలయాన్ని తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన కనెక్షన్లు వెంటనే ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. డబ్బులు చెల్లించిన నెల రోజుల్లో కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ బకాయిలను సకాలంలో రాబట్టాలన్నారు. వినియోగదారులకు మెరుగైన రీతిలో సేవలందించాలన్నారు.

అధికారులతో సమీక్షా సమావేశం..

డీఈ కార్యాలయంలో రాజంపేట డివిజన్ అధికారులతో ఎస్ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖపరమైన అంశాలపై పలుసూచనలు ఇచ్చారు. డీఈఈ సురేంద్రనాథ్, భాస్కర్, మురళీధర్‌లు డివిజన్ ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పీలేరు : విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర అన్నారు. గురువారం స్థానిక సీఎస్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు ఫుడ్ ప్రాసిసింగ్ యూనిట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు అనంతరం నిరుద్యోగులుగా మిగిలిపోకుండా వ్యాపారవేత్తలుగా తయారు కావాలన్నారు. అనేక స్వయం ఉపాధి పథకాలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయని తెలిపారు. అందులో పీఎంఎఫ్‌ఎంఈ ప్రధానమైందన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వాలు ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు, రుణాలు మంజూరు చేయడం తోపాటు యూనిట్ విలువలో 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. రూ. 10 లక్షల వరకు సూరిటీ లేకుండా బ్యాంకులు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు గోవర్దన్, మహేష్, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బోదేషావలి, కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర

ఆకేపాటికి కేంద్ర ఆరోగ్యశాఖ ప్రశంసాపత్రం



రాజంపేట: జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డికి కేంద్ర ఆరోగ్యశాఖ (మినిస్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) ప్రశంసాపత్రాన్ని శుక్రవారం జారీ చేసింది. ఇటీవల 200 మంది టీబీ రోగులను దత్తత తీసుకొని వారికి పౌష్టికాహారం అందచేశారు. ప్రధానమంత్రి టీబీ ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ అందించిన సహకరం విలువైనదని, టీబీ నివారణకు దోహదపడినందుకు కేంద్రం అభినందించింది. ఈ నేపథ్యంలో శనివారం రాజంపేట ఏరియా హాస్పిటల్‌లో డిప్యూటీ డీఎం హెచ్‌వో ఎస్సీ కృష్ణ ఆధ్వర్యంలో టీబీ నివారణా విభాగం అభినందన సభ నిర్వహించనున్నారు.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



గ్రామ, మండల సర్వేయర్లకు మెడికల్, స్టేషనరీ కిట్లను అందజేస్తున్న కలెక్టర్ గిరీషా

రాయచోటి: ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని గ్రామ, మండల సర్వేయర్లను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని 450 మంది గ్రామ, మండల సర్వేయర్లకు మెడికల్, స్టేషనరీ కిట్లను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రీ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. రీ సర్వేకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మొదటి దశలో పూర్తయిన గ్రామాలకు సర్వే రాళ్లను యుద్ధప్రాతిపదికన పాతాలన్నారు. జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్ మాట్లాడుతూ స్టేషనరీలో మెడికల్ కిట్లతో పాటు పేపర్స్, పాడ్స్ తదితర 24 అంశాలు కలిపి ఈ రెండు కిట్లను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పనుల్లో వేగం పెరిగేలా భూసేకరణ, నష్టపరిహారం పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ అంశాలపై సంబంధిత తహసీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లాలో సాగు, తాగు నీటి సమస్యలు అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అనేక లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను చేపట్టిందన్నారు. ఆయా పథకాలకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా రాయచోటి నియోజకవర్గంలో రామాపురం, ఎల్‌ఆర్ పల్లి,గాలివీడు, సంబేపల్లి, చిన్నమండెంలలోని చెరువులకు నీరు నింపేందుకు చేపట్టిన లిఫ్ట్ స్కీముకు 137 ఎకరాలు అవసరం కాగా ఇప్పటి వరకు 66 ఎకరాల భూసేకరణ చేసినట్లు చెప్పారు.హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 భూసేకరణలో భాగంగా మదనపల్లి, మొలకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లిలలో 185 ఎకరాలు అవసరం కాగా 60 ఎకరాలు, యూనిట్-2 ముదివేడు బ్రాంచ్ రిజర్వాయర్‌కు సంబంధించి 1075 ఎకరాలకు గాను 446.50 ఎకరాలు సేకరించినట్లు చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహమ్మద్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, ఎస్డీసీలు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- త్వరలో జగనన్న ఆణిముత్యాలకు సన్మానాలు
- జిల్లాకు రూ.50 వేలు, నియోజకవర్గ టాపర్లకు రూ.15 వేలు



పది పరీక్షలు రాసిన విద్యార్థులు

మదనపల్లె సిటీ: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే కార్పొరేట్ స్థాయిలో వసతులు, ఇంగ్లీషు మీడియం చదువులు, నాడు-నేడులో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అమలు చేస్తోంది. దీంతో ప్ర భుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్‌కు దీటుగా రాణిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వ బడుల్లో చదివి టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా, నియోజకవర్గస్థాయిలతో పాటు ఆయా యాజమాన్యాల వారీగా టాపర్లకు బహుమతులు అందించనున్నారు. జిల్లాలో నియోజకవర్గ, జిల్లా స్థాయిలో 22 మందిని ఎంపిక చేశారు. వీరికి త్వరలో జగన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు.

మొదటి మూడు స్థానాలకు....

జిల్లా విద్యాశాఖ అధికారులు మొదటి మూడు స్థానాలో నిలిచిన వారి జాబితాలను సిద్ధం చేశారు. వారికి బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందించనున్నారు. అలాగే ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను ,ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సాహించే దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ తరహా విధానాలు పిల్లల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తాయని, వారిలో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంటున్నారు.

నియోజకవర్గ స్థాయిలో...

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అత్యధిక మార్కులు సాధించిన మొదటి,రెండు, మూడో ర్యాంకు సాధించిన వారికి రూ.15 వేలు, రూ.10వేలు, రూ. 5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు.

జిల్లా స్థాయిలో...

మొదటి ర్యాంకర్‌కు రూ.50 వేలు, రెండో ర్యాంకర్‌కు రూ.30 వేలు, మూడో ర్యాంకర్‌కు రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు.

పోటీతత్వం పెరుగుతుంది



ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం శుభ పరిణామం. దీని వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుంది. రాష్ట్ర ,జిల్లా, నియోకవర్గ స్థాయిలో ర్యాంకులు సాధించాలనే తపన పెరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎక్కువ మంది ఉన్నత స్థానాలు అందిరోహించే అవకాశం కలుగుతుంది .

–ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ, మదనపల్లె

జిల్లా టాపర్లు

మండలం	విద్యార్థి పేరు
పీలేరు	ఏ.గీతాంజలి,వర్షిత
నందలూరు	.కృష్ణసీలావతి, ఎస్.బిందు
కలికిరి	ఎం.హారిక
చిన్నమండ్యం	బి.చందు
రాయచోటి	లావణ్య,విజయలక్ష్మి, శ్రావణి, రాజేష్‌నాయక్
ములకలచెరువు	జి.నిఖిల,హర్షిత
కురబలకోట	ఎ.మల్లికార్జున
పుల్లంపేట	వి.లక్ష్మిఅక్షయ
కలకడ	లక్ష్మిప్రసన్న, మధురిమ, తులసి,శిరీషా
మదనపల్లె	నందిని, కె.రెడ్డిరాణి, యజ్ఞవి
పీటీఎం	లిఖిత్‌కుమార్‌రెడ్డి
నియోజకవర్గ టాపర్లు	
రైల్వేకోడూరు	వాసు,సంతోష్‌కుమార్, లక్ష్మిఅక్షయ, బ్రాహ్మణి, భవానీలక్ష్మి స్పందన
మదనపల్లె	బి.నందిని, హిమసాయి, రెడ్డిరాణి,
పీలేరు	వర్షిత, సౌమ్యశ్రీ, ఉదయ వెంకటేష్
రాజంపేట	దివ్యశ్రీ, సౌజన్య
రాయచోటి	ప్రవల్లిక, షాహీర్ అర్షాద్, లావణ్య, లాస్య, సుజిత
తంబళ్లపల్లె	మల్లికార్జున, లిఖిత్‌కుమార్‌రెడ్డి, యశ్విని

రూ. 14.40 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న ఏపీఎఫ్‌పీఎస్ డిప్యూటీ సీఈవో రమేష్

పీలేరురూరల్ : జిల్లాలోని పీలేరు మండలం తలపులలో రూ. 14.40 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరైనట్లు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ సొసైటీ (ఎఫ్‌పీఎస్) డిప్యూటీ సీఈవో రమేష్ అన్నారు. గురువారం మండలంలోని తలపుల పంచాయతీలో ఈ యూనిట్ కోసం 8 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీలేరు మండలం తలపులలో శ్రీ అన్నమయ్య, శ్రీ సిద్ధేశ్వర రైతు సహకార సంఘాలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరైందని చెప్పారు. పనులు త్వరలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, జిల్లా రైతు సలహామండలి సభ్యుడు బోదేషావలి, అన్నమయ్య రైతు సహకార సంఘం అధ్యక్షుడు జయబ్బనాయుడు, కార్యదర్శి సురేంద్రనాయుడు, సిద్ధేశ్వర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజారెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట(సిద్ధవటం): ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి నెలసరి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు.ఆలయ రంగమండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.హుండీ ఆదాయం రూ.9 లక్షల, 2 వేలు వచ్చినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

రామాపురం : రామాపురం మండలం పరిధిలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయితీ కొత్తరోడ్డు నారాయణపురంలో గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొత్తరోడ్డు నారాయణపురానికి చెందిన రుక్మిణి మరో వ్యక్తితో కలిసి ఏపీ04 బీటీ 3969 గల ద్విచక్రవాహనంలో గువ్వలచెరువు నుండి ఇంటికి వెళ్తుండగా కొత్తరోడ్డు నారాయణపురం సమీపంలోని క్రాస్ అవుతుండగా కడప వైపు నుండి సూలిబీడుకు వెళ్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో రుక్మిణికి చెయ్యి విరిగి, తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108లో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

రామసముద్రం : ఘర్షణ కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరికెల పంచాయతీ గోసువారిపల్లె గ్రామానికి చెందిన శివారెడ్డికి అదే గ్రామానికి చెందిన రామచంద్రప్పలకు భూవిషయమై కోర్టులో కేసు నడుస్తోంది. దీనిపై ఈనెల 19వ తేదీన శివారెడ్డిపై రామచంద్రప్ప, అతని కుమారులు సురేష్, అశోక్‌లు తమపై కోర్టుకు వెళతావా అంటూ దౌర్జన్యం చేయడం జరిగిందన్నారు. శివారెడ్డి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సింగారెడ్డిపల్లెలో చోరీ

పెనగలూరు : మండలంలోని సింగారెడ్డిపల్లె పంచాయతీ, మోడల్ స్కూల్ ఎదురుగా సుచరిత అనే మహిళ ఇంట్లో బీరువా పగులకొట్టి 8 తులాల బంగారం అపహరించినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పుల్లంపేట కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సుచరిత శిక్షణ నిమిత్తం మూడు రోజుల క్రితం విజయవాడకు వెళ్లింది. ఈ విషయాన్ని పసిగట్టి బీరువా పగులకొట్టి బంగారు నగలను అపహరించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. గురువారం క్లూజ్ టీమ్ వచ్చి ఇంటి పరిసరాలను కూడా పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

108లో ప్రసవం

మదనపల్లె : 108లో పండంటి పాపకు ఓ తల్లి జన్మనిచ్చింది. వివరాలు.. మదనపల్లె మండలం బండకిందపల్లె అటవీప్రాంత పరిసరాల్లో నివాసమున్న ఓబయ్య భార్య నరసమ్మ (37) మూడవసారి గర్భం దాల్చింది. గురువారం తెల్లవారు జామున పురిటినొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108 గ్రామానికి చేరుకుని నరసమ్మను వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో పండంటి పాపకు జన్మనిచ్చింది. సుఖప్రసవం అనంతరం ఈఎంటీ రెడ్డి జస్వంత్,పైలెట్ సదా... పాపను కుటుంబ స భ్యులకు అప్పగించారు.

లోన్‌యాప్, బెట్టింగ్‌లకు యువకుడి బలి

- రూ.4 లక్షలు చెల్లించాలని బాధపడేవాడు
- వారంలో సర్దుబాటు చేస్తానన్న తండ్రి
- ఆలయంలో ఉరేసుకున్న శ్రావణ్‌కుమార్‌రెడ్డి


శ్రావణ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

బి.కొత్తకోట : రుణయాప్ వేధింపులు, క్రికెట్ బెట్టింగులతో ఓ ప్రయివేటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి ఆలయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. మృతుడు బి.కొత్తకోట మండలం సూరప్పవారిపల్లె పంచాయతీ దయ్యాలవారిపల్లెకు చెందిన ఎస్.శ్రావణ్‌కుమార్‌రెడ్డి (24). కాగా నాయనబావి పంచాయతీలో అత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ కే.రామమోహన్, కుటుంబీకుల కథనం మేరకు వివరాలు.. దయ్యాలవారిపల్లెకు చెందిన ఎస్.జయరాంరెడ్డి కుమారుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను రుణయాప్ ద్వారా అప్పు చేశాడు. దీనికి సంబంధించి వేధింపులు ఎదురుకావడంతో ఆరునెలల క్రితం రూ.3.50 లక్షలు చెల్లించి రుణ విముక్తుడయ్యాడు. తర్వాత క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇటీవల అప్పులకు సంబంధించి రూ.4లక్షలు కావాలని బాధపడేవాడు. ఈ విషయాన్ని తండ్రి జయరాంరెడ్డికి చెప్పడంతో వారంరోజుల్లో సర్దుబాటు చేస్తానని ధైర్యం చెప్పాడు. అయితే ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేకపోయిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి బుధవారం సాయంత్రం ములకలచెరువుకు చేరుకున్నాడు. అక్కడినుంచి బి.కొత్తకోటకు వచ్చినా స్వగ్రామం దయ్యాలవారిపల్లెకు వెళ్లకుండా నాయనబావి పంచాయతీ ఆకులవారిపల్లె సమీపంలోని పొలాల్లో ఉన్న పురాతన పూతపలేశ్వరస్వామి ఆలయం చేరుకున్నాడు. ఆలయంలోని టవల్‌ను తీసుకుని ఆలయ ఇనుప గ్రిల్‌కు బిగించి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. మృతుని కుటుంబానికి దూరపు బంధువైన రెడ్డెప్పరెడ్డి జయరాంరెడ్డికి ఫోన్‌చేసి శ్రావణ్‌కుమార్‌రెడ్డి చనిపోయిన విషయం తెలియజేయడంతో కుటుంబీకులు ఆలయంకు చేరుకుని విలపించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామమోహన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడిన చోట కత్తి, కొడవలి, సెల్‌ఫోన్, బ్యాగు ఉన్నాయి. తొలుత కత్తితో కోసుకుని ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆలయంలో టవల్ కనిపించడంతో దానితోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై తండ్రి జయరాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

జైలుకైనా వెళతాం..
ఇంటి పట్టాలు వదలం

పెట్రోల్ బాటిల్‌తో రెవెన్యూ ఆఫీసు ముందు నిరసన


రెవెన్యూ కార్యాలయం ముందు ఆడబిడ్డలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆదిలక్ష్మి

కురబలకోట : కొంతకాలంగా ఇంటి పట్టాల స్థలం చూపాలని తిరుగుతున్నాం..అధికారులు పట్టించుకోవడం లేదు. జైలుకైనా వెళతాం కాని ఇంటి పట్టాల వ్యవహారాన్ని వదిలేది లేదని మండలంలోని ముదివేడు గ్రామం గొల్లపల్లెకు చెందిన దంపతులు రెడ్డెప్ప, ఆదిలక్ష్మి, వారి ఆడబిడ్డలతో కలసి గురువారం రెవెన్యూ కార్యాలయం ముందు బైఠాయించారు. పెట్రోల్ బాటిల్‌తో గంట పాటు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బాధిత దంపతుల కథనం మేరకు.. 12 ఏళ్ల క్రితం ముదివేడు కస్బాలో సర్వేనెంబరు 617/బి1డిలో ఆదిలక్ష్మి, ఆమె అత్త పేరుతో రెండు ఇంటి పట్టాలు ఇచ్చారు. వీటిని వారి సమీప బంధువు ఒకరు వేరొకరికి అక్రమంగా అమ్ముకున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఇప్పుడు ఇవి విలువైన స్థలాలుగా మారాయి. తమకు ఇంటి పట్టాలుగా ఇచ్చిన స్థలాలను తమకు స్వాధీనం చేయాలని ఒకటిన్నర సంవత్సరంగా రెవెన్యూ అధికారులతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. న్యాయం కోసం అర్జీలు కూడా ఇచ్చారు. అయినా వీరికి న్యాయం జరగలేదు. గురువారం కూడా ఇంటిపట్టాల వ్యవహారంపై తహశీల్దారు కార్యాలయంకు వచ్చారు. అక్కడి రెవెన్యూ అధికారి రోజూ ఇదేనా పని బయటకు పోండని వారిని గద్దించారు. దీంతో వారు న్యాయం కోసం అడిగితే బయటకు పొమ్మంటారా..అంటూ కార్యాలయం ముందే దంపతులతో పాటు వారి ఆడబిడ్డలతో బైఠాయించారు. అంతేకాదు వెంట పెట్రోల్ బాటిల్ కూడా తెచ్చుకున్నారు. న్యాయం జరగకపోతే పెట్రోల్ పోసుకుని చనిపోతామని హెచ్చరించారు. అవసరమైతే జైలు కైనా వెళతాం ఇంటి పట్టాల సమస్యను వదిలేదని తేల్చి చెప్పారు. దీంతో కార్యాలయం వద్ద ఆందోళన కర పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులకు సమాచారం ఇచ్చారు.అక్కడి రెవెన్యూ ఉద్యోగులు జోక్యం చేసుకుని పెట్రోల్ బాటిల్‌ను వారి నుండి స్వాధీనం చేసుకున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే వేరొకరి ఆక్రమణలో ఉన్న సదరు భూమిని స్వాధీనం చేసుకోవాలని సర్వేయర్, వీఆర్వోలను తహశీల్దారు ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులను అంబులెన్సులో ఎక్కిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు : మండలంలో ఓబిలి హీరా పాఠశాల వద్ద రెండు స్కూటర్లు ఢీ కొనడంతో ఇరువురు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే .. నెల్లూరు జిల్లాకు చెందిన కొమ్మినేని చంద్రమోహన్ తన అత్తగారి ఇల్లు అయిన ఎన్ఆర్ పురానికి వచ్చి తిరిగి స్కూటర్‌పై నెల్లూరుకు వెళ్తుండగా చిట్వేలి నుంచి వాయిదాల వ్యాపారి యాహుద్దీన్ ద్విచక్రవాహనంలో వస్తూ ఢీ కొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం అంబులెన్సు ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు సమాచారం.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం సిద్దవరంలో జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తుండగా.. ఓబిలి సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో పడిపోయారు. అది గమనించిన కొరముట్ల శ్రీనివాసులు తమ వాహనాన్ని ఆపి తన అనుచరులతో క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించారు. 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పిడుగు పడి రెండు ఆవులు మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ బొమ్మిరెడ్డిపల్లికి చెందిన కొర్రా నారాయణస్వామి అనే రైతుకు చెందిన రెండు పాడి ఆవులు పిడుగు పాటుకు బలయ్యాయి. బాధిత రైతు కుటుంబం టమోటా పంటలను సాగు చేసి గిట్టుబాటు ధర లేక అప్పుల్లో కూరుకు పోయారు. ఈ నేపథ్యంలో రూ.లక్ష విలువ చేసే రెండు పాడి ఆవులను కొనుగోలు చేసి వాటితోనే జీవనాధారంగా చేసుకునేవారు. ఈ తరుణంలో బుధవారం రాత్రి మండలంలో ఈదురు గాలులతో కూడుకున్న భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పాటుకు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం ద్వారా పరిహారం మంజూరయ్యేలా కృషి చేస్తామని గురువారం సర్పంచ్ శివాల లోకేష్, ఎంపీటీసీ రవికుమార్ బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: పిడుగు పడి పాడిఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని గుర్రంకొండ పంచాయతీ సుంకరవాండ్ల పల్లెలో జరిగింది. గురువారం సాయంకాలం గాలీవాన బీభత్సానికి జీవనతోపు మార్గంలో చెట్లు కూలి కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలపై పడ్డాయి. గుర్రంకొండలోని ఓ ఇంటిపై పిడుగు పడింది. సుంకర వాండ్లపల్లెలో సుంకర భార్గవ అనే పాడి రైతు సమీప పొలంలో షెడ్లు వేసి పాడి ఆవులు మేపుతున్నాడు. షెడ్డువద్ద ఆరుబయట ఉన్న పాడిఆవు వద్ద పిడుగు పడడంతో ఆవు మృతి చెందింది. అలాగే పట్టణంలోని కడప-బెంగుళూరు మార్గంలో బాషా అనే వ్యక్తి ఇంటిపై భాగంలో పిడుగు పడింది. దీంతో ఇంటిపై భాగంలో కొద్దిగోడ, గ్రిల్స్ దెబ్బతిన్నాయి. సుమారు మూడుగంటల పాటు విద్యుత్ సరఫరా లేక పట్టణవాసులు ఇబ్బంది పడ్డారు.

పాల ట్యాంకర్ పేలి ఒకరు మృతి


పాల ట్యాంక్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తున్న టెక్నీషియన్లు


ట్యాంకర్ నుంచి మృతదేహాన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో పాలట్యాంకర్ పేలి టెక్నిషియన్ జోగేంద్ర సింగ్ (32) అక్కడిక్కడే మృతి చెందాడు. నాగరాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాయచోటి ఫైర్ అధికారి వెంకట్రామిరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాయచోటి - వరిగ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విజయ (ఎస్‌పీవై రెడ్డి వారి) డైరీ కోసం పాల శీతలీకరణకు ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్న సమయంలో అందులోకి గ్యాస్‌ని నింపే పరికరంలో రిపేరు రావడంతో హర్యానాకు చెందిన టెక్నీషియన్‌ను పిలిపించి రిపేరు చేయిస్తున్నారు. ఈ క్రమంలో ట్యాంకర్ లోపలికి వెళ్లి గ్యాస్ ట్యాంకర్ రిపేరు చేస్తున్న క్రమంలో ఒక్క సారిగా పెద్ద పేలుడుతో కూడిన శబ్దంతో ట్యాంకర్ పేలిపోయింది. అప్పటికే ట్యాంకర్ లోపలి భాగంలో దట్టమైన పొగలు (అమ్మోనియం) నిండిపోవడంతో ఊపిరాడక జోగేంద్ర సింగ్ అక్కడిక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న మరో వ్యక్తి నాగరాజు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు గమనించి పోలీసులు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వెంటనే రెస్క్యూ టీంతో కలిసి ట్యాంకర్‌ను కట్ చేసి లోపల ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టు మార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నామని అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి, ఇనాయతుల్లాలు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటయ్య

పీలేరు రూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. తిరుపతి జిల్లా రొంపిచెర్ల మండలం మోటుమల్లెల పంచాయతీ దాసరిగూడెంకు చెందిన తుపాకుల వెంకటయ్య (55) తన కుమార్తె మాధవి మదనపల్లె సమీపంలో బస్సు బోల్తా పడ్డ ప్రమాదంలో గాయపడింది. ఆమెకు స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని శశి హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. కుమార్తెను చూడ్డానికి వచ్చిన వెంకటయ్య గురువారం రాత్రి ఆస్పత్రి నుంచి రోడ్డుపైకి వచ్చాడు. తిరుపతి వైపు నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొని వెళ్లిపోయింది. గమనించిన బంధువులు హుటాహుటిన హాస్పత్రిలోకి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరెంటు వైర్ల చోరీ

నందలూరు (రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలో కరెంటు వైర్ల చోరీకి దొంగలు పాల్పడుతున్నారు. వరుసచోరీలతో పంచాయతీ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏటి పరీవాహక ప్రాంతమైన గొల్లపల్లె, అరవపల్లెకు నీటి సరఫరా చేసే మోటారు వైర్లు చోరీ అయ్యాయి. తాగునీటి సరఫరా 50 మీటర్లు వైర్లను కట్ చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లె సర్పంచి జంబుసూర్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ గొల్లపల్లె, అరవపల్లెకు మంచినీరు సరఫరా చేసే మోటారు వైర్లు చోరీకి గురై నీటిసరఫరా నిలిచిపోయిందన్నారు. కొత్త కేబుల్ తెప్పించి, మోటార్లకు బిగించడం జరిగిందన్నారు. దొంగలను వెంటనే పట్టుకోవాలని పోలీసులను కోరామన్నారు.

విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : రెండవ జాతీయ ఫ్లోర్ క్లరింగ్ సీనియర్ ఛాంపియన్ షిప్-2023 పోటీలలో అన్నమయ్య జిల్లా క్రీడాకారులు సత్తా చాటడంపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ ఆర్ గంగాధర్ రావులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం విజేతలుగా నిలిచిన మహిళా పోలీస్ కె మేరీ సుష్మ, సబ్ జూనియర్ కేటగిరిలో సత్తా చాటిన వై కిస్టియానా, టీ జన్నీఫర్ సులోచలను కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గంగాధర్ రావులు వేరు వేరుగా అభినందించారు. అన్నమయ్య జిల్లా, చిన్నమండెం మండలం, దేవలంపేట సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ కె మేరీ సుష్మ కాంస్య పతకం కైవసం చేసుకుంది. అలాగే సబ్ జూనియర్ కేటగిరిలో వై కిస్టియానా, టీ జన్నిఫర్ సులోచన కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ మహ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి


ఆసీఫ్ (ఫైల్)

గుర్రంకొండ : వ్యాపారంలో నష్టం రావడంతో టమాటా వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తరిగొండలో జరిగింది. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన చెందిన షేక్ గౌస్‌పీర్ సాహెబ్ కుమారుడు షేక్ ఆసీఫ్ రహీమ్(24) అనే వ్యక్తి డ్రైవర్‌గా పని చేస్తూ ఇటీవల సొంతంగా మినీలారీలు నిర్వహిస్తున్నాడు. స్థానికంగా నిర్వహించే టమాటా మండీలలో టమాటాల వ్యాపారం చేసేవాడు. సుమారు రూ.5.50లక్షల వరకు రైతుల దగ్గర కొనుగోలు చేసిన టమాటాలకు సంబంధించిన డబ్బులు చెల్లించాల్సి ఉంది. వ్యాపార లావాదేవీల్లో నష్టాలు వచ్చాయి. దీంతో మనస్తాపం చెందిన ఆసీఫ్ ఐదు రోజుల కిందట పురుగుల మందు తాగాడు. గమనించిన కటుంబ సభ్యులు 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 24న పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం అక్కడ వైద్యసేవలు పొందుతూ ఆసీఫ్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం


మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి

రాయచోటి అర్బన్ : ప్రతినెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లించేలా ప్రభుత్వం వెంటనే చట్టాన్ని తీసుకురావాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసుల రెడ్డి, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌లు డిమాండ్ చేశారు. తమ సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపులో భాగంగా గురువారం ఏపీజీఈఏ రాయచోటి నియోజకవర్గం కార్యవర్గసభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట రిలేనిరాహార దీక్షలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు పరచాలన్నారు. ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. రిలే నిరాహార దీక్షలలో ఏపీజీఈఏ రాయచోటి అధ్యక్ష, కార్య దర్శులు సాయికుమార్, సుజిత్ డాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రెడ్డి భాస్కర రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లంరాజు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, సుధాకర్ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్వరరాజు, ఎన్‌జీఓ హౌస్ బిల్డింగ్ సొసైటీ రాయచోటి అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్ రాజా, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.